క్లుప్తంగా

విద్యార్థులకు షూ పంపిణీ



మంఖాల్‌లో విద్యార్థులకు షూ పంపిణీ చేసిన భాస్కర్‌రెడ్డి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం స్థానికుడు అయినాల విజయ్ భాస్కర్ రెడ్డి షూను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులకు ఉచితంగా షూలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బాకి విలాస్, పాఠశాల చైర్మన్ బాబు, హెచ్‌ఎం శోభ, నాయకులు వెంకటేశ్, జాను, సురేశ్, జంపన్న, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరుకు రూ.52.50 లక్షల నిధులు: జెడ్పీటీసీ

కందుకూరు: మండల పరిధిలోని గూడూరులో వివిధ చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి గాను రూ. 52.50 లక్షల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. మంత్రి సబితారెడ్డి చొరవతో సీ డీపీ నిధుల నుంచి కలెక్టర్ అమయ్‌కుమార్ నిధులు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రఘుమారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

తుక్కుగూడ: మహేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ చింతల రఘుమారెడ్డి మరణం బీజేపీకి తీరని లోటు అని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బుధవారం రఘుమారెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రఘుమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు వై.శివకుమార్, నాయకులు జపాల సుధాకర్, బరిగెల రాకేశ్, వెంకటాచారి పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుతోనే అభివృద్ధి పనులు: కమిషనర్

తుర్కయంజాల్: ప్రతి ఒక్కరు సకాలంలో పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. బుధవారం కేబీ స్కూల్ యాజమాన్యం రూ.3,32,131 పన్నును చెక్కు రూపంలో మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. 100 శాతం పన్నుల వసూళ్ల టార్గెట్‌ను పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐలు పి.చంద్రశేఖర్, నగేష్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పిస్తామని దళారుల వసూళ్లు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ పాపయ్యగూడలో గుడిసెలు వేసుకుంటున్న పేద ప్రజల నుంచి కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, వారిపట్ల అప్రమత్తగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ... గుడిసెలకు పట్టాలు ఇప్పిస్తామని, కొందరు దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారని.. సీపీఐ పార్టీ నుంచి ఎవరూ డబ్బులు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. పేదల వద్ద ఎవరైనా వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి గాని, పోలీసుల దృష్టికి గాని తేవాలని వారు తెలిపారు. భూదాన బోర్డు మాజీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి అనుచరులు కొంతమంది పాత తేదీల్లో పట్టాలు ఇచ్చినట్లు నకిలీ ప్రొసీడింగ్ పత్రాలు సృష్టించి పేద ప్రజలను మభ్యపెట్టి భూదందా చేస్తున్నారని వారు ఆరోపించారు. పేద ప్రజలకు ఇండ్ల స్థలాల కొసం భూ పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

హయత్‌నగర్: మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్పర్సన్ స్వప్న అన్నారు. బుధవారం కుంట్లూర్ 20వ వార్డులో సుమారు రూ.5.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీలోని పాత గ్రామాల్లో చాలాచోట్ల డ్రైనేజీ, రోడ్ల సౌకర్యం లేవని.. ఆయా చోట్ల త్వరలో నిర్మిస్తామని తెలిపారు. వేసవికాలం సమీపిస్తుండటంతో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని.. దీనిపై త్వరలోనే అధికారులతో చర్చిస్తామని ఆమె పేర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్ జోర్కగీతా శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ ఓరుగంటి సుజాతా కిషన్‌గౌడ్, డీఈఈ అశోక్‌కుమార్, నాయకులు చామ విజయ్‌శేఖర్‌రెడ్డి, చెవుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లకు సోలార్ సొబగులు

ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ వెలుగులు కనిపించనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఇప్పటికే మన ఊరు– మనబడి కార్యక్రమం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. సకల సౌకర్యాలతో పాటు పాఠశాలలపై విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ మరో అడుగు ముందుకేసి పాఠశాలల్లో సోలార్ సిస్టం (సౌర విద్యుత్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.



జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానెళ్లు

- ‘రెడ్కో’ సహకారంతో జిల్లాలో 140 పాఠశాలల్లో ఏర్పాటు
- మొదటగా జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు
- పాఠశాలలకు తగ్గనున్న విద్యుత్ భారం

మీర్‌పేట: రెడ్కో సంస్థ సహకారంతో సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని 140 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రతీ పాఠశాలలో 2 కిలోవాట్స్ సామర్థ్యం గల (240 యూనిట్లు) సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయనున్నారు. సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను జెన్‌కో వారు తీసుకొని తిరిగి అంతే విద్యుత్‌ను పాఠశాలకు ఇవ్వడం జరుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు భవిష్యత్తులో విద్యుత్ బిల్లుల చెల్లింపుకు స్వస్తి పలికే అవకాశం ఉండొచ్చని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

2 కిలోవాట్స్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు

మనఊరు–మనబడి కింద ప్రభుత్వం ఇప్పటికే జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ఉన్నత, ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేసింది. దీంతో పాటు జిల్లాలో సోలార్ విద్యుత్ సిస్టంను కూడా ఇదే పాఠశాలలో మొదటగా ఏర్పాటు చేయడం విశేషం. ప్రైమరీ, హైస్కూళ్లకు వేర్వేరుగా 2 కిలోవాట్స్ గల సోలార్ విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఒక కిలోవాట్స్‌కు 120 యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. దీంతో పాటు రెడ్కో సంస్థ వారు తరగతి గదుల్లో తక్కువ విద్యుత్ వినియోగించే 30 అధునాతన ఫ్యాన్లను, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

విద్యుత్ భారం తగ్గుతుంది



సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ భారం పూర్తిగా తగ్గిపోనుంది. జిల్లాలోనే అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాల కావడం, 25 తరగతి గదులు, ప్రతీ గదికి నాలుగు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు ఉండటంతో ప్రతి నెలా రూ.4 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తుంది. మా పాఠశాలలో మరో 3 కిలోవాట్స్ సోలార్ ఏర్పాటు కోసం విద్యాశాఖ అధికారులకు లేఖ రాస్తాం.

– సరళారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లెలగూడ

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని గంగారం గ్రామ పంచాయతీ మైలార్‌బాయి తండాకు చెందిన రాత్లావత్ మోత్యా నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను మంత్రి సబితారెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. భార్య పిల్లలను ఆమె ఓదార్చి మనోధైర్యం కల్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పిల్లలను గురుకుల పాఠశాలలో చదివించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంగారం సర్పంచ్ సాలీవీరా నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంధ్యానాయక్, శ్రీను, రాజు, ఠాగూర్ పలువురు పాల్గొన్నారు.

చిగురింత నర్సింహారెడ్డి పరామర్శ..

రాత్లావత్ మోత్యా నాయక్ కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం మోత్యానాయక్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దశరథ్‌నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, నాయకులు అల్లె కు మార్, పాండు నాయక్, దేవానాయక్, ఒగ్గు శ్రీకాంత్, బిచ్యా నాయక్, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.



మోత్యానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సబితారెడ్డి

నూతన నియామకం



శివకుమార్‌గౌడ్

కందుకూరు: మండల కేంద్రంలోని నవతరం యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా ఉడుతల శివకుమార్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో యూత్ సభ్యులందరూ సమావేశమై అధ్యక్షుడితో పాటు మిగతా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నవతరం యువజన సంఘం ప్రధాన కార్యదర్శులుగా బుట్టి ప్రశాంత్, సాయిబాబా, ఉపాధ్యక్షులుగా గాండ్ల సంతోష్‌కుమార్, సైదావల్లి చోటు, కోశాధికారిగా తాళ్ల అఖిల్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. యువతకు ఆదర్శంగా ఉంటూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు విరివిగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మాజీ అధ్యక్షుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, తాళ్ల కార్తీక్, నిరంజన్‌జీ, బొక్క దీక్షిత్‌రెడ్డి, కోణం వెంకటేశ్, సభ్యులు శ్రీనివాస్‌జీ, వినోద్‌చారి, సతీష్, రాజశేఖర్‌రెడ్డి, మధుకర్, శేఖర్‌చారి, నవీన్‌కుమార్, సాయికుమార్, పృథ్వీధర్‌రెడ్డి, నితిన్, సల్మాన్, కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం



కందుకూరు చౌరస్తాలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ తదితరులు

- ఆర్డీఓ సూరజ్‌కుమార్
- ఓటరు దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

కందుకూరు: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కుపై అధికారులు ప్రచారం చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు దేశ భవిష్యత్‌నే మార్చుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ శ్రావణ్, ఆర్‌ఐలు ప్రేమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో..

మీర్‌పేట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, అర్హులైన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మీర్‌పేట మున్సిపల్ కమిషనర్ సిహెచ్. నాగేశ్వర్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిల్ కలెక్టర్లు, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బందిచే కమిషనర్ ప్రతిజ్ఞ చేయించి, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఏకైక ఆయుధం ఓటు అని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజలకు మేలు చేసే నాయకులను ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మీర్‌పేట: ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ నాగేశ్వర్ తదితరులు

ఆరోగ్యం @ఓపెన్ జిమ్స్



శివనారాయణపురంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమాన్ని అనుసరించిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఓపెన్ జిమ్‌లను ప్రవేశ పెట్టి అమలు చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ ఓపెన్ జిమ్‌లు మహిళలు, యువకులు, పెద్దవారు అనే తేడా లేకుండా సద్వినియోగం చేసుకొని వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. దీంతో ఓపెన్ జిమ్‌లపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

- కార్పొరేషన్ పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న ప్రజలు
- ఆసక్తి చూపుతున్న యువత

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలుచోట్ల ఓపెన్ జిమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బడంగ్‌పేటలోని 29వ డివిజన్‌లోని సీతా మెడోస్ కాలనీలో, 20వ డివిజన్‌లోని అన్నపూర్ణనగర్ కాలనీలో, అల్మాస్‌గూడలోని వైఎస్‌ఆర్ పార్కులో, 22, 23 డివిజన్లలోని శివనారాయణపురం కాలనీలో, తదితర చోట్ల ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. వీటికి దగ్గరగా ఉన్న కాలనీవాసులు, చుట్టుపక్కల ఇళ్లకు చెందిన మహిళలు వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక ప్రతి సెలవు దినాల్లో ఈ ఓపెన్ జిమ్‌లు చిన్నారులతో, విద్యార్థులతో రద్దీగానే ఉంటున్నాయి. చాలా డివిజన్‌లలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ.. స్థానిక కార్పొరేటర్లు ఇప్పటికే కార్పొరేషన్ అధికారులకు దరఖాస్తులు సమర్పించారు.

ఒత్తిడిని అధిగమించేందుకు..

కాలనీలల్లో నివాసం ఉండే ఉద్యోగస్తులు, ఇతర ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు వారాంతం కష్టపడుతూ ఉంటారని వారి ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు నిత్యం అరగంట లేదా గంట పాటు ఏదో ఒక వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. నిత్యం ఏర్పడుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేసి ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రైవేట్ జిమ్‌లలో వేలకు వేలు ఫీజులు చెల్లించలేని పేదవారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



కాలనీల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ప్రజలు, కాలనీవాసులు, ముఖ్యంగా గృహిణులు ఎక్కువగా ఉపయోగించుకోవాలి. వ్యాయామంతో ఒత్తిడి దూరమవుతుంది. మానసిక ప్రశాంతత వస్తుంది. ఆరోగ్యంగా కూడా ఉండవచ్చు. కాలనీవాసులకు ఇప్పటికే చెప్పాం. కొంతమంది మహిళలు, యువకులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– రాళ్లగూడం సంతోషి, కార్పొరేటర్,బడంగ్‌పేట్

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

పహాడీషరీఫ్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని బీఆర్‌ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వాదే ముస్తఫా బస్తీలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాదే ముస్తఫా–2 క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. క్రికెట్ టోర్నమెంట్‌ల నిర్వహణ ద్వారా యువతలో ఐక్యతాభావం కూడా పెంపొందుతుందన్నారు. క్రీడామైదానం విషయమై స్థలం కోసం మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయని, విజేత జట్టుకు రూ.5 వేల నగదు పురస్కారంతో పాటు ట్రోఫీని అందించనున్నట్లు షేక్ అఫ్జల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషూద్దీన్, సవూద్ అవల్గీ, మజ్హర్ అలీ, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సయ్యద్ హుస్సేన్, సాల్హె బావజీర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి హాజరైన కార్తీక్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మహేశ్వరం: పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన గండికోట సుశీలకు మంజూరైన రూ.30 వేల సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులకు మంత్రి ఆమె నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాన్నారు. బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, నర్సింహ పలువురు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల పరిధిలోని కొలన్‌గూడకు చెందిన వేల్పుల మహేందర్‌కు రూ.55 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈమేరకు ఆ చెక్కును బుధవారం సర్పంచ్ గీతేశ్వరి లబ్ధిదారుడికి అందజేశారు. అర్హులైన ప్రతిఒక్కరూ సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆదర్ల వెంకటేశ్, నాయకులు గణేశ్, బండ రాజు, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రోజురోజుకు కొత్తకాలనీలు పెరుగుతున్నాయని.. ఆయా ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. వసతుల కల్పన దిశగా అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బుధవారం హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలిసి అధికారులతో డివిజన్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి ఇమాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని కాలనీలలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఆయా ప్రాంతాలలో పర్యటించి నివేదిక సమర్పించాలన్నారు. కాలనీలలో నూతన రోడ్లను, మంచినీటి పైప్ లైన్‌ల ఏర్పాటు, విద్యుత్ త్రీఫేస్ కరెంట్ అవసరమో గుర్తించి వాటిని తన దృష్టికి తీసుకొస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు మంజూరు అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో అత్యుత్తమ నియోకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని శంకరకొండతండాలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన కనిపించింది. శిబిరాన్ని ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్ ప్రారంభించారు. శిబిరంలో మండల పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 63 పశువులకు చికిత్స నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పశుపోషణ, పునరుత్పత్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లచ్చి, ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్, స్థానిక నాయకులు పత్యానాయక్, విజయ్, పశువైద్యశాఖ సిబ్బంది మల్లీశ్వరిదేవి, పాలాక్ష, శివలింగం, రమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

లింగంపల్లిలో..

మంచాల: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 53 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. పాడిరైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద మూర్తి, పశువైద్యులు డాక్టర్ సుధారెడ్డి, సురేందర్, నాగమణి పశువైద్య సిబ్బంది రాంచందర్, శ్రీశైలం, శివరాజ్, పశుమిత్ర బచ్చమ్మ, గోపాలమిత్ర బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం డా.మంజులాదేవి ఆధ్వర్యంలో 157 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, డా.పరీక్షిత్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

122 మందికి..

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన కంటి వైద్య శిబిరంలో బుధవారం 122 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సైదమ్మ, రామకృష్ణ, మాధవి, స్వాతి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

యాచారం: కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు రాజ్యలక్ష్మి, ప్రియాంక పేర్కొన్నారు. యాచారం, చింతుల్ల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాలను వారు పరిశీలించారు. కంటి వెలుగు పథకం సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

ట్రాఫిక్ సీఐ నాగమల్లు

హుడాకాంప్లెక్స్: క్రీడలు నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ నాగమల్లు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని భాష్యం విద్యాసంస్థ హైస్కూల్ క్రీడోత్సవ పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగాయి. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ నాగమల్లు, జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు, ప్రిన్సిపాల్ పల్లవిలు, జోన్–3 శాఖల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు. అనంతరం విజయం సాధించిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.



క్రీడా పోటీలకు హాజరైన సీఐ నాగమల్లుకు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్య అతిథులు

రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించుతాం

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని రైతుసంఘాల నేతలు స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నంలో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి బొంగ్లూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యుత్ సవరణ బిల్లు, నల్లచట్టాలను దొంగదారిన ఆమోదించేందుకు కేంద్ర చూస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పద్మ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సేవా పతకాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఏడుగురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్‌లు, కానిస్టేబుల్‌లు సేవా పతకాలు అందుకున్నారు. సత్ప్రవర్తనతో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు పోలీసులకు ప్రభుత్వం పతకాలు అందించింది. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐలు నిరంజన్, యాదయ్య, కానిస్టేబుల్ పర్వతాలు, కడ్తాల పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ నర్సింహులుశెట్టి, హెడ్‌కానిస్టేబుల్‌లు రవీందర్, విఠలయ్యగౌడ్ సేవా పతకాలకు ఎంపికయ్యారు. సైబరాబాద్‌లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర పోలీసులకు బుధవారం సేవా పతకాలు అందించారు. ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్, ఎస్‌ఐ సుందరయ్య, హరీష్‌శంకర్, వెంకటేశ్ వారిని అభినందించారు.